# పూదోట

వడిలిన పూల మొక్కలా వుంది భారతి. అవ్యక్తమైన బాధ ఆమె గుండెల్లో సుళ్ళు తిరుగుతూంది. తన అశక్తతకు దిగులు, తమ ముంగిట్లో కనీస సంస్కారానికి చోటు లేకపోయినందుకు సిగ్గు, కృతజ్ఞతకు, నిజాయితీకి ప్రతిబింబమైన ఒక వ్యక్తికి దీనస్థితిలో సహాయపడకపోగా అవమానించి పంపినందుకు దుఃఖం ఆమె హృదయాన్ని కోస్తున్నాయి. అన్యమనస్కంగా చీకటిని కప్పుకున్న లోకాన్ని చూస్తూ మొక్కల మధ్య తిరుగుతూంది. ఆ మొక్కల స్పర్శ ఆమె గాయాల సలుపునింకా ఎక్కువ చేస్తూంది.

అవును! ఈ మొక్కలే అతను తనకు భక్తితో పెట్టిన నైవేద్యం. ఎన్నేళ్ళ అనుబంధం అది? ఎన్ని పువ్వుల సౌరభాలతో తనను అర్చించాడతను? ఎన్నెన్ని మొక్కల పచ్చదనంతో తన ప్రాంగణాన్ని శోభింపచేసాడతను? యీ తోటలోని ప్రతి మొక్క అతని చేతిలో ఊపిరి పోసుకున్నదే. ప్రతి చెట్టు అతను ప్రేమతో నాటినదే. అప్పుడే ఎన్నేళ్ళు గడిచి పోయాయి? భారతి తలపులకు వెనుక తలుపులు తెరుచుకున్నాయి.

డా॥ భారతి కొత్తగా ప్రాక్టీస్ పెట్టిన రోజులు. అటు పట్టణం యిటు పల్లెటూరు కాని ఊరి వాతావరణానికి అలవాటు పడుతున్న సమయం. అప్పుడే ప్రాక్టీస్ పుంజుకుంటూంది. అప్పుడప్పుడే జనం ఆమెను గుర్తిస్తున్నారు.

ఒక నడిరాత్రి గుర్రపువాతంతో చావు బ్రతుకుల మధ్య వున్న భార్యను తీసుకువచ్చి భారతి నర్సింగ్‌హోమ్‌లో చేర్చాడు సీతారాం. అప్పటికి ఇద్దరు డాక్టర్లు ప్రాణాపాయంలో వున్న రోగిని చూడగానే గవర్నమెంటు హాస్పటల్‌కి తీసుకు పొమ్మని సలహా యిచ్చి తమ దగ్గర చేర్చుకునేందుకు నిరాకరించారు. ఈ తిరుగుడుతో, ఎత్తిదించడాలతో పుణ్యకాలం కాస్తా గడిచి పరిస్థితి మరింత విషమిస్తాంది. ఈ డాక్టరమ్మయినా చేర్చుకుంటుందో లేదో, ఒక వేళ చేర్చుకున్నా వేలకు వేలు డబ్బు పెట్టందే ముట్టనంటుందేమోనని అందోళన పడుతున్నాడు సీతారాం. అలా కాక పేషెంటుని చూచీచూడగానే ముందు తన దగ్గర వున్న మందులతో చికిత్స ప్రారంభించి తనకు ధైర్యం చెప్పిన భారతిని చూస్తే ఏ దేవతో తనను అనుగ్రహించి దిగివచ్చినట్లు అనిపించింది. రోగి గండం గడిచి బయటపడేదాకా నిద్రాహారాలు లేకుండా ఆమె చూపిన శ్రద్ధ, చేసిన సేవ అపూర్వమనిపించాయి సీతారాంకి. ఇక చనిపోయినట్టేనని ఆశ వదులుకున్న తన భార్య కళ్ళు విప్పి తనతో మాట్లాడుతూంటే ఉద్వేగంతో చలించిపోయాడు. హృదయం కరిగి కన్నీళ్ళు కార్చాడు. 'దేవుళ్ళు' 'దేవతలు' వున్నారో లేదో నాకు తెలియదు. ప్రత్యక్షంగా కనిపిస్తున్న యీ డాక్టరమ్మ మాత్రం తమ పాలిట దేవతే', అని తన భార్యను చూడవచ్చిన బంధుమిత్రులందరికీ చెప్పుకున్నాడు సీతారాం.

"అమ్మా పేదవాడిని. యింతకంటే యిచ్చుకోలేను" తన భార్యను, తొలిబిడ్డను యింటికి తీసుకువెళ్తూ తన శక్త్యానుసారం డబ్బును భారతి ముందు పెట్టాడు సీతారాం.

"ఫరవాలేదు. ఆమె బ్రతికింది. అదే చాలు" తనేదో మహోపకారం చేసానన్న ప్రదర్శన కాక అతి ప్రశాంతంగా, సరళంగా, క్లుప్తంగా జవాబిచ్చిన భారతికి కృతజ్ఞతతో నమస్కరించి సెలవు తీసుకున్నారు సీతారాం దంపతులు.

అంతవరకు పల్లెటూళ్ళో పొలాన్ని నమ్ముకుని బ్రతుకుతున్న సీతారాంకి కొడుకు పుట్టుకతో కొత్త ఆలోచనలు, పథకాలు ప్రారంభమయ్యాయి. ఉన్న అరెకరం భూమిని అమ్మి భారతి నర్సింగ్‌హోమ్‌కి మూడు వీధుల అవతల వున్న స్థలాన్ని అద్దెకు తీసుకుని నర్సరీని పెంచడం మొదలుపెట్టాడు. తన భార్యకు, కొడుకుకు ఏ అవసరమొచ్చినా తక్షణ వైద్యసహాయం అందుతుందన్న ఆశతో పుట్టిపెరిగిన ఊరిని వదలడానికి సిద్ధ పడ్డాడు.

జనవరి ఒకటవ తేదీన భార్య, బిడ్డతో సహా పెద్ద గులాబీల బొకె తీసుకుని తనను గ్రీట్ చెయ్యడానికి వచ్చిన సీతారాంని సాదరంగా ఆహ్వానించింది భారతి.

అతనందించిన పూలగుత్తిని అప్యాయంగా అందుకుని మెరుస్తున్న కళ్ళతో రంగు రంగుల గులాబీల్ని తదేకంగా చూస్తూంది. అత్యంత ఉత్సాహంతో తన నర్సరీ గురించి, తను సేకరించిన మొక్కల రకాల గురించి వర్ణించి చెప్తున్నాడు సీతారాం.

"అమ్మగారూ! మీరొక్కసారి యింటి దగ్గరకు రావాలి" భారతికి ఊపిరాడనివ్వ కుండా తొందరచేసి హాస్పటల్లో నుంచి యింటికి తీసుకు వచ్చాడు సీతారాం.

ఇంటి ముందున్న విరబూసిన గులాబీ, చామంతి కుండీల్ని చూడగానే సంభ్రమంగా ఒక్క అంగలో వాటి దగ్గరకు వెళ్ళిందామె.

"ఎంత బావున్నాయో?" అచ్ఛాదన లేని ఆనంద ప్రదర్శనతో ఆమె కళ్ళు వెలుగుతున్నాయి.

"నా నర్సరీలో పెంచినవే అమ్మగారూ!" సంతోషం, కించిత్ గర్వం తొంగి చూచాయి సీతారాం మాటల్లో.

"భలే పెంచావు. ఎంత బావున్నాయో చెప్పలేను" చిన్న పాపలా మురిసిపోతూ పువ్వుల్ని తాకుతున్న భారతి హృదయం గడిచిపోయిన బాల్యాన్ని గుర్తుకు తెచ్చు కుంటూంది.

"యీ కుండీల్ని మీకోసమే తెచ్చాము అమ్మగారూ" మాటాడని మల్లెమొగ్గలా వుండే సీతారాం భార్య లక్ష్మి పలువరుస కనపడేలా నవ్వుతూ చెప్పింది.

"నిజం!" తన కోసమే తెచ్చారని తెలుస్తూనే వున్నా తన సంబరాన్ని ప్రకటిస్తూ లక్ష్మి చేతిని అందుకుంది భారతి.

"ఔనమ్మగారూ యివి అచ్చంగా మీ కోసమే. కాంపౌడరుని రోజూ కాస్త నీళ్ళు పోస్తూ ఆలనా పాలనా చూడమనండి. అప్పుడప్పుడూ నేనొచ్చి చూస్తా వుంటాను. అక్కడ తోటలో చచ్చేంత పనుంది. మొక్కల్ని కొనడానికి బోల్డుమంది వస్తున్నారు. నానా హైరానాగా వుందనుకోండి" హడావిడి పడుతూ చెప్తున్నాడు సీతారాం.

"సింగినాదం! అక్కడికి ఈయనొక్కడే పాటుపడతన్నట్టు! ఈయన గారికి కొడుకు ముచ్చట్లతోనే సగం పొద్దు గడిచిపోతాంది. యింటి పని, తోట పనితో సస్తా వుంది నేను. ఈయన మాటలు నమ్మబాకండమ్మగారూ" తన ఎదుట అవసరమైతే తప్ప నోరు విప్పని లక్ష్మి భర్త వంక ఓరగా చూస్తూ కబుర్లు చెప్తూంటే వాళ్ళిద్దరినీ ముచ్చటగా చూస్తూంది భారతి.

"ఓసోస్. నువ్వేనేంటి అంత పాటుపడతాంది. ఏంటా పాటు. సోలెడు గింజలు పొంగించడమేనా? దాని మాటలకేంగానండి అమ్మగారూ కాంపౌడర్ గార్ని కాస్తంత జాగ్రత్తగా మొక్కలు వడలకుండా చూసుకోమనండి. మరి మేమెళ్ళొస్తామండి." కన్న కూతుర్ని అప్పగింతలు పెడుతున్నట్లు చెప్తున్నాడు సీతారాం.

భారతికి వాకిటి నిండుగా వున్న పూల కుండీల్ని చూస్తే పరమానందంగానే వుంది గాని సీతారాంకి డబ్బివ్వకుండా యిన్ని కుండీల్ని ఎలా తీసుకోవడం? డబ్బిస్తే నొచ్చు కుంటాడేమో అని గుంజాటన పడుతూంది.

"ఒక్క నిముషం సీతారాం" అంటూ ఇంట్లోకి వెళ్ళి సీతారాం దంపతులకు కాఫీ పంపింది. అంతలో భారతి భర్త డా॥ ఆనంద్ స్కూటర్ని ఆపి లోపలికి వచ్చాడు. ముభావంగా, సీరియస్‌గా వుండే ఆనంద్ ముఖం చూస్తే జంకు సీతారాంకి. అందుకే అతనిని చూడగానే ప్రక్కకి ఒదిగి నుంచున్నాడు.

"పూల కుండీల్ని చూసారా! ఎంత బావున్నాయో కదూ" లోపల నుండి వస్తూ భర్తను అడిగింది భారతి.

"బావున్నాయి" పూలకుండీల వంక తల తిప్పి చూడను కూడా చూడకుండా ముక్తసరిగా జవాబిచ్చి లోపలికి వెళ్ళిపోయాడతను. భర్త నుండి అంతకంటే మెరుగైన ప్రతిస్పందనను ఆశించని భారతి చిన్న బుచ్చుకోకుండా చిరునవ్వుతో సీతారాం దంపతుల వైపు తిరిగింది.

"సీతారాం! ఈ పూట నాకెంత సంతోషంగా వుందో చెప్పలేను. చిన్నప్పుడు మా ఊళ్లో మా పెరట్లో ఎన్ని మొక్కల్ని పెంచేదాన్నో! ఊళ్ళో ఎవరి దొడ్లో ఏ కొత్త మొక్క వున్నా దాన్ని అంటుకట్టి నాకిచ్చేదాకా వాళ్ల ప్రాణం తీసేదాన్ని. నీకో గమ్మత్తు చెప్పనా? కొమ్మ తెచ్చి పాతి పెట్టాననుకో... దానికి వేళ్లు వచ్చాయో లేదోనని వారానికోసారి పీకి చూచే దాన్ని. యీ పీకుడుతో సగానికి పైగా చచ్చూరుకునేవి" గలగలా నవ్వింది భారతి. మామూలుగా ఎక్కువగా మాట్లాడని భారతి సంతోషాన్ని గమనించాడు సీతారాం.

"ఇంటర్‌కి హాస్టల్‌కి వెళ్ళిన దగ్గర్నుండీ మొక్కలతో సంబంధంపోయింది. ఇప్పుడింక ఇల్లు, హాస్పటల్‌తోనే గడిచిపోతూంది బ్రతుకంతా" కొన్ని అందమైన, ఆనంద ప్రదమైన అంశాల్ని కోల్పోతున్నాననే వ్యధ ధ్వనించిందామె స్వరంలో.

"యికనుండి మీకా దిగులక్కర్లేదమ్మగారూ! మీకళ్ళ ముందు ఎప్పటికప్పుడు విరగబూసిన పూల మొక్కల్నుంచుతాను చూడండి"- అప్పటి వరకు గుప్పెట్లో

డబ్బును దాచి వుంచిన భారతి దానిని అతనికివ్వడానికి సంకోచపడుతూంది.

"మరెళ్ళొస్తామండి అమ్మగారూ!" దంపతులిద్దరూ చేతులు జోడించి వెళ్ళబోయారు.

"సీతారాం, నువ్వేమీ అనుకోనంటే ఒక్క విషయం... ఇదుంచాలి నువ్వు" భారతి చేతిలో వున్న డబ్బు వంక ఆశ్చర్యంగా చూచాడు సీతారాం.

"అదేంటమ్మగారూ మీరు నాకు డబ్బిస్తారా? నేను మీకు మొక్కల్ని అమ్ము కోనా?" దెబ్బతిన్నట్లు చూచాడు సీతారాం.

"అదికాదు సీతారాం. అవి నువ్వు అమ్మకానికోసం నర్సరీలో పెంచినవి. వాటి మీద వచ్చే దానితోనే నువ్వు, నీ కుటుంబం బ్రతకాలి. ఇన్నిన్ని మొక్కల్ని నాకు ఊరికినే యిచ్చేస్తే ఎలా", నచ్చచెప్తున్న ధోరణిలో అంది భారతి.

"అట్లా అనకండమ్మగారూ! నన్నూ... నా కొడుకునీ మీరు బ్రతికించకపోతే యివాళిట్లా వుండే వాళ్లమా...? మీరు డబ్బుకి రొక్కిస్తే మాకా అరెకరం చెక్క మిగిలేదా? యిప్పుడీ మొక్కల్ని పెంచగలిగేవాళ్ళమా?" లక్ష్మి ముఖంలోని నిజాయితీని చూచి చలించి పోయింది భారతి. ఇదామెకు కొత్త అనుభవం. చదువు పూర్తవగానే పొట్టచేత్తో పట్టుకుని వచ్చి ఈఊళ్ళో ప్రాక్టీస్ పెట్టినప్పటినుంచి కొంత మందికైనా ఎంతో కొంత ఉపకారం చేసింది తను. వాళ్లందరూ అప్పుడేనో లేక అతికొద్ది కాలానికో తను చేసిన ఉపకారాన్ని మరచి పోయివుంటారు. ఒకవేళ మరచి పోకపోయినా యిలా తమ కృతజ్ఞతనెప్పుడూ యింత స్వచ్ఛంగా వ్యక్త పరచలేదు. ఈ కొత్త అనుభవం ఆమె హృదయాన్ని మెత్తగా స్పృశిస్తూ ఉదాత్త భావాల్ని సృజిస్తోంది. వారి అభిమానం, ఆప్యాయత ఆమెకు తన మీద, మనుషుల మీద విశ్వాసం కలిగేలా చేస్తున్నాయి.

"అదికాదమ్మా అది నా చేతిలో పని ..."

భారతి మాటలను మధ్యలోనే అడ్డుకుంది లక్ష్మి. "ఇదీ మా చేతిలో పనేనమ్మ గారూ"

"అలాకాదు - కుండీలకు, మొక్కలకు, ఎరువులకు, పురుగు మందులకు.. ఎంత ఖర్చు!" వాళ్ల ప్రేమతో యిస్తున్నా అన్ని మొక్కల్ని ఊరికే తీసుకోవడానికి మొహమాటంగా వుంది భారతికి.

"ఇంకేం చెప్పకండమ్మగారూ. నేను మాత్రం డబ్బు తీసుకోను" స్పష్టంగా

చెప్పి భార్య చెయ్యిపుచ్చుకొని బయటకు నడిచాడు సీతారాం.

ఎప్పటికప్పుడు కుండీల నిండుగా పువ్వుల్ని పూయించి రకరకాల మొక్కల్ని తెచ్చి, ముందు తెచ్చిన మొక్కలు నవనవలాడుతున్నాయో లేదో చూచి కాంపౌడర్‌కి జాగ్రత్తలు చెప్పి వెళ్లేవాడు సీతారాం. మొక్కలంటే అంతగా ప్రేమ, శ్రద్ధలేని కాంపౌడర్ చాలీ చాలకుండా నీళ్ళు పోసీ, చీడ పడితే చప్పున పట్టించుకోక, మొక్కల ఆయుర్దాయాన్ని సగానికి సగం తగ్గించేవాడు.

"అయ్యో! అయ్యో! ఈ మొక్కిలా వడిలిపోయిందేంటి? నీళ్ళకు కూడా కరువొచ్చిందేంటయ్యా బాబూ!" వడిలిపోయిన మొక్కని పట్టుకుని లబలబలాడుతున్న సీతారాంని చూస్తే చిరాగ్గా వుంది కాంపౌడర్‌కి. యీ మొక్కల పని రాక ముందు పెద్ద పనేమీ లేకుండా అలా అలా నీటుగా తిరిగిన అతనికీ అదనపు పనంతా తలనొప్పి వ్యవహారంలా వుంది.

"ఏంటయ్యా, వెధవ మొక్క వడిలితేనే ఏదో లక్షల రూపాయలు పోగొట్టుకున్నట్టు నస?" ఇంటి నుంచి హాస్పటల్‌కు వెళ్తున్న భారతి చెవిలో యీ మాటలుపడ్డాయి.

"లక్షల రూపాయల కంటే ప్రాణం విలువయిందని నీకు తెలియకపోయినా అమ్మగారికి, నాకు తెలుసు. అంచేత ఘరానా మాటలు మాట్లాడక... సరిగ్గా పని చూడక పోతే అమ్మగారి దాకా తీసుకు పోవాల్సి వస్తది విషయాన్ని" కాంపౌడర్‌ని హెచ్చరిస్తూనే వడిలిన మొక్కల సంరక్షణను చూడసాగాడు సీతారాం.

ఇద్దరి మాటల్ని విని మౌనంగా వెళ్లిపోయిన భారతి పని ఒత్తిడిలో పడి మొక్కల విషయం అజ తీసుకోనందుకు నొచ్చుకుంది. సీతారాం వెళ్ళిపోయాక కాంపౌడర్‌ని పిలిచి మందలించింది. మొక్కయినా, మనిషయినా నయం చెయ్య లేని జబ్బుతో చనిపోవడం వేరు. తిండి లోపంవల్లో, వైద్య లోపంవల్లో చనిపోవడం దారుణమని తను నమ్మిన విషయాన్ని సీతారాం నోటి వెంట విన్న భారతి చెవుల్లో ఆ మాటలే గింగురుమంటున్నాయి. అవును! మొక్కయినా, మనిషయినా తిండి లోపంవల్లో, వైద్య లోపంవల్లో చనిపోగూడదు. కాని ప్రస్తుత పరిస్థితుల్లో అదెంత అసంభవమైన స్వప్నమో ఆమెకు తెలుసు.

కాలం గడిచిపోతూంది. సీతారాంకి మరో యిద్దరు పిల్లలుపుట్టారు. యీ రెండుసార్లూ కూడా లక్ష్మికి అకస్మాత్తుగా బి.పి. ఎక్కువయి ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లింది. మూడో బిడ్డ పుట్టాక సీతారాంని కోప్పడి అతనికి ఆపరేషన్ చేయించింది

భారతి.

"అమ్మగారూ! ఎన్ని జన్మలెత్తినా మేము మీ రుణాన్ని తీర్చుకోలేము." భర్తను యింటికి తీసుకువెళ్తూ వంగి భారతి కాళ్లకు నమస్కరించింది లక్ష్మి. పాదాభివందనా లంటే నొసలు చిట్లించే భారతి గబుక్కున లక్ష్మి భుజాలు పట్టుకుని పైకి లేపింది.

"ఏయ్! ఏమి పని యిది. యీ కాళ్ళకు మొక్కడాలెప్పుడు నేర్చుకున్నావు. నా రుణం సరే... మరి మీ రుణాన్నెలా తీర్చుకోవాలో ముందు చెప్పు."

"పేదవాళ్లం, మేము మీకేం చేసామమ్మా. ఇన్నేళ్ళ నుండీ మీతో చూపించు కుంటున్నాం. ఎన్నడూ మీకు ఫీజుగా ఒకపైసా డబ్బివ్వకపోగా మీ దగ్గరున్న మందులు కూడా యిస్తున్నారు. నాకు గానీ... పిల్లలకు గానీ వచ్చిన యీ మాయదారి జబ్బులకు మందులన్నీ కొని, ఫీజులు కట్టాలంటే మావల్లయ్యేదా? యిట్లా రెండు పూటలా పిల్లల్తో కలిసి యింత ముద్ద తింటున్నామంటే మీ చలవ వల్లే కదమ్మా!" సజల నేత్రాలతో భారతి వంక చూచింది లక్ష్మి. తమకు ఆరోగ్య పరమైన ఆపద వచ్చినప్పుడల్లా డాక్టరుగా ఆదుకోవడమే కాక మనిషిగా భారతి యిచ్చిన ధైర్యం, ఊరడింపు గుర్తుకొచ్చి ఆమె గుండె కృతజ్ఞతతో బరువెక్కింది.

"లక్ష్మీ! యిది అన్యాయం. లెక్కలు వేసేటప్పుడు సగం లెక్కలు వెయ్య గూడదు. ఇంతటి విశాలమైన స్థలాన్ని వెదికి, కొనేదాకా నాచుట్టూ తిరిగి దీన్ని నందనవనంగా తీర్చిదిద్దిందెవరు? ఇన్నేళ్ల నుంచి యిన్నిన్ని మొక్కల్ని పెంచి, పూలు పూయించి నా యింటికి తెచ్చి అలంకరిస్తున్నందుకు నేను మీకెంత డబ్బిచ్చాను? అన్నిటికీ మించి మొక్కలంటే ప్రాణమయిన నాకు ఏమాత్రం శ్రమలేకుండా మొక్కలతో నిండిన అందమైన వాతావరణాన్ని, పువ్వుల పరిమళం అందించే అద్భుతమైన ఆనందాన్ని సృష్టించి ఇచ్చినందుకు నేను మీకు యిచ్చిన ఫీజు ఎంతోలెక్కకట్టి చెప్పమ్మా."

భారతి మాట్లాడుతున్న ధోరణిని చూచి కన్నీళ్లను తుడుచుకుంటూ అప్రయత్నంగా నవ్వింది లక్ష్మి.

"పిచ్చి లక్ష్మీ! ఈ లోకంలో ప్రతిదీ డబ్బుతో ముడిపడి వుంది, నిజమే. కానీ కొన్ని డబ్బుతో అందని ఆనందాలు, డబ్బుతో వెలకట్టలేని విలువలు వుంటాయి. అంచేత లెక్కలాపి మీ ఆయన్ని యింటికి తీసుకు వెళ్లు." మౌనంగా భారతికి నమస్కరించి వెళ్లింది లక్ష్మి.

కాలం కడుపులోకి సంవత్సరాలెన్నో దొర్లిపోయాయి. ఇప్పుడు రాత్రి, పగలు అనే తేడా లేకుండా పని చెయ్యలేకపోతూంది భారతి. ఇంతకు ముందే సంపాదిస్తున్న స్త్రీ కాపురాన్ని నిలుపుకోవడం కోసం సంపాదన లేని భర్తతో ఎన్ని రకాలుగా రాజీ పడాలో అన్ని రకాలుగా రాజీ పడింది. ఆ క్రమంలో డబ్బు మీద పెత్తనాన్ని కావాలనే ఒదులుకుంది. తన హాస్పిటల్‌కి, ప్రాక్టీస్‌కి వారసులుగా నిలుస్తారని ఆశించిన కొడుకు, కోడలు ఈ చిన్నటౌన్‌లో ఎదుగూబొదుగూ లేని జీవితం తమ కొద్దని స్పష్టంగా చెప్పి విశాఖలో ప్రాక్టీస్ పెట్టారు.

సీతారాం జీవితంలోనూ ఎన్నో ఒడిదుడుకులొచ్చాయి. కొడుకులిద్దరికీ చదువుసంధ్యలబ్బలేదు సరికదా బ్రతుకు బాధ్యతల్లేకుండా తిరగడం నేర్చుకున్నారు. కూతురి కాపురం సరిలేక పసిపిల్లల్తో పుట్టింటికి చేరింది. బెంగతో మంచమెక్కిన లక్ష్మి హఠాత్తుగా చనిపోయింది. పని చేసే ఓపిక లేక కొంత, పెట్టుబడికి డబ్బు లేక కొంత, జీవితం కొట్టిన దెబ్బలకు బ్రతకాలనే యిచ్ఛ, ఉత్సాహం చచ్చిపోయి కొంత సీతారాం శ్రద్ధ చూపెట్టక నర్సరీ పాడయిపోయింది. డబ్బుకు ఎన్ని  ఇబ్బందులొచ్చినా భారతి ముందు చెయ్యి చాపని సీతారాం ఒకరోజు భారతి దగ్గరకు వచ్చాడు.

"ఏంటి సీతారాం? లక్ష్మి పోయాక అసలు కనపడడమే మానేసావేంటి? అయ్యో ఇలా అయిపోయావేమిటి సీతారాం?" చిక్కిసగమయి, గడ్డం పెరిగి, తైలసంస్కారం లేని జుట్టు ముఖాన పడుతూండగా ఖంగు ఖంగున దగ్గుతున్న సీతారాం వంక ఆదుర్దాగా చూచింది భారతి.

"కొద్దిగా ఒంట్లో బాగోడంలేదమ్మగారూ... పెద్దగా ఆరోగ్యం బాగోకపోవడమేం లేదు." అలవాటు లేని అబద్ధం చెప్పడానికి అవస్థపడుతున్నాడు సీతారాం.

"ఇంతలా దగ్గుతూ ఏమీ లేదంటావేమిటి." గదిమి, అన్ని పరీక్షలూ చేసి మందులిచ్చింది భారతి. మందుల్ని తీసుకుని బయటకు వెళ్ళిన సీతారాం కాసేపు అటూ యిటూ తచ్చిట్లాడుతూ భారతి మిగిలిన పేషెంట్స్ కూడా చూసిపంపాక మళ్ళా లోపలకు వచ్చి తల వంచుకుని నుంచున్నాడు

"ఏంటి సీతారాం" అతని వంక  ఆశ్చర్యంగా చూస్తూ అడిగింది భారతి. ఎప్పుడూ గలగలా మాట్లాడుతూ, నవ్వుతూ పరిసరాల్ని ఉత్తేజితం చేసే సీతారాం, ఎన్ని కష్టాలొచ్చినా నిబ్బరంగా 'జీవితంలో ఇవన్నీ ఒక భాగం' అనే తాత్త్విక ధోరణితో

ఎదుర్కొన్న సీతారాం అంత దీనంగా తన ముందు నిలబడడం చూచి భారతి కలవరపడింది.

"ఏమయింది సీతారాం" దగ్గరగా వచ్చి ఆత్రుతగా అడిగింది.

"అమ్మగారూ! ఒక్క ఐదు వందలు కావాలి" దుఃఖంతో బొంగురు పోయింది సీతారాం కంఠం.

జీవితంలో మొట్టమొదటిసారి తన ముందు డబ్బు కోసం చెయ్యి చాస్తున్న అతని హృదయం ఎంతగా విలపిస్తూందో గ్రహించింది భారతి. అతను డబ్బు ఇబ్బందుల్లో ఉన్నాడని తెలిసి తనెన్నిసార్లు డబ్బివ్వబోయినా చాలాబాధ పడిపోయి ఖచ్చితంగా తిరస్కరించిన సీతారాం ఎంత కష్టంలో వుండి తనను అడుగుతున్నాడో అనుకుంది.

"భలే వాడివే, ఏదో ప్రపంచమంతా మునిగిపోయినట్లు క్రుంగి పోతావేంటి. నన్ను డబ్బు అడగడానికి అంత మొహమాటమేమిటి నీకు? పద యింటికి వెళ్దాం... పేషెంట్స్ ఎవరో జున్ను యిచ్చారు తిని వెళ్దువు గాని"

భారతి వెంట కలలో నడుస్తున్నట్లు నడిచి వరండాలో బెంచీ మీద కూర్చు న్నాడు. సీతారాంకి జున్ను అంటే ఇష్టమని తెలిసిన భారతి గిన్నె నిండుగా జున్ను తెచ్చి సీతారాంకి యిచ్చి డబ్బు తేవడానికి లోపలికి వెళ్లింది.

"ఎందుకా డబ్బు?" డబ్బు తీసి బీరువా మూస్తున్న భార్యను అడిగాడు డా॥ ఆనంద్.

"సీతారాంకి ఇవ్వడానికి" అతని స్వరంలోని కరుకుదనం భారతి మనసును పొడిచింది.

"ఊళ్ళోని అలగా వెధవలందరికీ డబ్బివ్వడానికి యిదేమన్నా ధర్మబ్యాంకా?" అతని మాటల్ని సీతారాం ఎక్కడ వింటాడోనని కంగారు పడిపోయింది భారతి.

"ఏమిటండీ ఆ మాటలు? సీతారాం మొట్టమొదటి సారి నన్ను డబ్బు అడిగాడు. ఈ మాత్రం దానికి అంతగా దూషించాలా" ఆవేదనగా అడిగింది.

"మొదటి సారే కానీ చివరిసారి మాత్రం కాదు. ఆ వెధవ వాలకం చూడు. తాగుడుకు అలావాటు పడ్డాడో ఏమిటో? యింక మాటమాటకూ వచ్చి ఏదో ఒక కన్నీళ్ల స్టోరీ చెప్పి నీ దగ్గర డబ్బు గుంజక పోతే నన్నడుగు."

రాత్రయితే స్పృహలో వుండని ఆనంద్ సీతారాం గురించి అంత నిందా పూర్వకంగా మాట్లాడడం విని బాధ పడింది భారతి.

"సీతారాం అలాంటివాడు కాడు. పువ్వుల్ని పెంచే అతని హృదయం ఎంత నిర్మలమయిందో మనకు తెలియదా? అంత స్వచ్ఛమైన అతని హృదయంలో మోసం వుండదు."

"పువ్వుల్ని, మొక్కల్ని పెంచి అమ్ముకోవడం అతని వృత్తి. మనిషి డబ్బు కోసం పువ్వుల్నీ అమ్ముకోగలడు, ఎ.కె. ఫార్టీసెవెనుల్నీ అమ్ముకోగలడు. వీడేదో ప్రత్యేకంగా ఆకాశం నుంచి ఊడిపడ్డట్లు కబుర్లు చెప్తావేమిటి?"

కందిరీగల తుట్టలా వున్న అతని ఆలోచనల్ని, భావాల్ని విని తట్టుకోలేక పోతూంది భారతి.

తనెంత నెమ్మదిగా సీతారం వినకూడదన్నట్లు మాట్లాడుతున్నా బిగ్గరగా మాట్లాడుతున్న ఆనంద్ మాటలు సీతారాం చెవిన పడ్డాయేమోనని ఆందోళన పడుతూంది. ఇంత వక్రంగా వున్న ఇతని మాటల్ని తను పట్టించుకోవలసిన పనిలేదు. మొక్కల్ని అమ్ముకునే వాడికీ ఎ.కె. ఫార్టీసెవనుల్ని అమ్ముకునే వాడికి గల తేడాని గుర్తించగల విచక్షణ లేని మనిషితో తను మాటలు పెంచడం వృధా. మనిషి మీద నమ్మకం, మానవత్వం మీద మమకారం, మనిషిని గౌరవించే సంస్కారం, పూదోటలో పూల మొక్కల్ని సంరక్షించుకున్నట్లు హృదయంలో సంరక్షించు కోకపోతే కలిగే దుష్ఫలితాన్ని ప్రదర్శిస్తున్నాడితను. తన సహచర్యంతో యీ ఉన్నతమైన భావాల్ని భర్త హృదయంలో నిలపలేకపోయిన తన వైఫల్యాన్ని తలచుకుని క్రుంగిపోవడంకన్నా ఆత్మాభిమానాన్ని చంపుకుని తన ముందు చెయ్యి చాచిన సీతరాంని గౌరవంగా పంపించి వేయడం తక్షణ కర్తవ్యంగా తలచి గుప్పెట్లో వున్న డబ్బుతో వరండాలోకి వచ్చింది భారతి.

తింటున్న జున్నుగిన్నెను వదిలేసి సీతారాం వెళ్ళిపోయాడని తెలియగానే దుఃఖం వెల్లువలా పొంగి వచ్చింది. ఇంత నిర్దయ! ఇంత కుసంస్కారం! భరింపలేని వేదనతో, అరికట్టలేని అలజడితో మొక్కల మధ్య తిరుగుతూంది భారతి.

- *'రచన', 1994*